


కేసీఆర్‌ను పరామర్శించిన ఎంపీ కేశవరావు, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, మహేందర్ రెడ్డి, దయానంద్‌గుప్తా, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి,

# కేసీఆర్‌ను పరామర్శించిన నేతలు



మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

ప్రమాద వశాత్తు గాయపడి మలక్‌పేటలోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును పలువురు నేతలు పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకొని ప్రజలకు సేవలందించాలని వేడుకున్నారు.





ఎమ్మెల్సీ కవిత

# ఎన్నికల నిర్వహణలో చురుకైన పాత్ర

## ఎలక్షన్ సెల్ సిబ్బందిని అభినందించిన సీపీ చౌహాన్




సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో సిబ్బంది కృషిని గుర్తిస్తూ ఎలక్షన్ సెల్ సిబ్బందిని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ శుక్రవారం అభినందించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా పనిచేసేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తూ ఎలక్షన్ సెల్ సిబ్బంది పనిచేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అన్ని వేళల్లో అప్రమత్తంగా పనిచేశారని సీపీ తెలిపారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించడంతో రూ.68 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు, అలాగే నగదు, మద్యం అక్రమ రవాణాను ఎక్కడికక్కడే నిలువరించి, ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్‌కుమార్, ఎస్బీ ఓఎస్డీ మహేశ్, ఐటీసెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్లు కొండల్‌రావు, రవికుమార్‌లతో పాటు పలువురి సిబ్బందికి సీపీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

## జనవరి 4 నుంచి డీఈఎల్ ఈడీ పరీక్షలు

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 8: జనవరి 4 నుంచి 2022-24 విద్యా సంవత్సరానికి గాను డీఈఎల్‌ఈడీ(డిప్లొమా నుంచి ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) మొదటి సంవత్సరం, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల ప్రధానోపాధ్యాయులు ఇందుకోసం విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉచిత ఫౌండేషన్ తరగతులు



సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): బంజారా మహిళా సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత ఫౌండేషన్ తరగతులను ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జాపాల గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ఫౌండేషన్ క్లాసులను ప్రారంభించినట్లు సొసైటీ ప్రతినిధులు డాక్టర్ ఆనంద్, హరిప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బీమ్లా నాయక్, వెలిమినేడు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్సీ కాలనీ డ్రైనేజీ సమస్యపై నివేదిక ఇవ్వండి

వివిధ శాఖల అధికారులకు హై కోర్టు ఆదేశం

జూబ్లీహిల్స్, డిసెంబర్ 8 : నగరంలోని పార్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కార చర్యలపై నివేదిక సమర్పించాలని మున్సిపల్, జీహెచ్ఎంసీ, జల మండలిని హైకోర్టు ఆదేశించింది. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి పర్యవేక్షణలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు అక్కడి పరిస్థితిని పరిశీలించాలని కోరింది. ఈ నెల 20లోగా నివేదిక సమర్పించాలని జస్టిస్ టి.వినోద్ కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.




## కాంచీపురం నారాయణి సిల్క్స్ షోరూమ్ ప్రారంభం

కేపీహెచ్‌బీ కాలనీలో కాంచీపురం నారాయణి సిల్క్స్ 9వ షోరూంను డైరెక్టర్ పీవీఎస్ అభినయ్ శుక్రవారం ప్రారంభించారు. కాంచీపురం నారాయణి సిల్క్స్‌ను ఎస్.సురేశ్, టి.కేశవ్ గుప్తా, టి.రాకేశ్ అత్యుత్తమ నాణ్యతతో ప్రామాణికమైన క్రియేషన్‌లతో విలువైన బ్రాండ్‌లను అందిస్తూ ప్రసిద్ధి చెందిన సంస్థగా నిలిపారని అన్నారు.

## మౌలాలి జోనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు 51 ఏండ్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : సికింద్రాబాద్ మౌలాలిలో ఉన్న జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ స్థాపించి 51వ సంవత్సరాలు పూర్తైన సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, ఎస్‌సీఆర్‌కు చెందిన వివిధ విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## బంజారాహిల్స్‌లో మీనాక్షి చౌదరి సందడి



బంజారాహిల్స్, డిసెంబర్ 8: బంజారాహిల్స్ రోడ్ నం:10లోని చిల్లపల్లి వీవర్లీ చేనేత స్టోర్ ప్రారంభోత్సవం సందర్భంగా టాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి శుక్రవారం సందడి చేశారు. రానున్నది పెళ్లిళ్ల సీజన్ కావడంతో మనసుకు నచ్చే పట్టు చీరలను, చేనేత చీరలను, వధువుల అందాన్ని రెట్టింపు చేసే పలు రకాల చీరలను అందించడం తమ ప్రత్యేకత అని నిర్వాహకులు తెలిపారు.

## ఇద్దరు మాదిగలకు మంత్రులుగా అవకాశం కల్పించాలి

### ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 8 : తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రి వర్గంలో ఇద్దరు మాదిగలకు మంత్రులుగా అవకాశం కల్పించాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ప్రస్తుతం చోటు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తార్నాకలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అగ్రవర్ణాలతో నూతన మంత్రివర్గం నిండిపోయిందని అన్నారు. మొత్తం 11మంది మంత్రులలో ఏడుగురు అగ్రవర్ణాలకు చెందిన వారే ఉన్నారని, 52శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం రెండు పదవులు, పది శాతం జనాభా ఉన్న ఎస్టీలకు ఒకటి మాత్రమే దక్కిందని తెలిపారు. 12 శాతం ఉన్న మైనారిటీలకు మంత్రి పదవి దక్కలేదని దుయ్యబట్టారు. మంత్రివర్గ విస్తరణలో వీటన్నింటినీ సరిచేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందని అభిప్రాయపడ్డారు.

## లాప్రోస్కోపిక్ ఆంకాలజీ-2023 సదస్సు ప్రారంభం




బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో లాప్రోస్కోపిక్ ఆంకాలజీ సదస్సును ప్రారంభిస్తున్న డా.ప్రభాకర్‌రావు, తదితరులు

బంజారాహిల్స్, డిసెంబర్ 8 : లాప్రోస్కోపిక్ ఆంకాలజీలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక పద్ధతులపై చర్చించేందుకు మూడురోజుల పాటు నిర్వహించే ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ ఆంకాలజీ-2023 సదస్సు శుక్రవారం బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలనుంచి వచ్చిన 100మందికి పైగా మినిమల్ యాక్సిస్ సర్జన్స్ ఈ సదస్సులో పాల్గొని లాప్రోస్కోపిక్ ఆంకాలజీలో వచ్చిన అత్యాధునిక పరిజ్ఞానం, నైపుణ్యాల గురించి పరస్పరం చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సీఈవో డా.ఆర్‌వీ ప్రభాకర్‌రావు, మెడికల్ డైరెక్టర్ డా.టీఎస్.రావు, డా.ఈశ్వరమూర్తి, డా.అనిల్ హెరూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయండి

### యూనివర్సల్ షాంపూ ఇన్సూరెన్స్ కంపెనీకి ఆదేశాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): వాహన ఇన్సూరెన్స్ క్లెయిమ్ రూ.7.5లక్షలు చెల్లించాలని యూనివర్సల్ షాంపూ ఇన్సూరెన్స్ కంపెనీని హైదరాబాద్ వినియోగదారు కమిషన్ ఆదేశించింది. ముషీరాబాద్ రాంనగర్‌కు చెందిన సత్యేంద్రనాథ్ ఠాక్రే 2020లో మహారాష్ట్రలోని పుణేలో వ్యాగనార్ నూతన కారును కొనుగోలు చేశాడు. 2021-22 సంవత్సరానికి హైదరాబాద్‌లో యూనివర్సల్ షాంపూ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి తన వాహనానికి పూర్తి స్థాయి (ఫుల్) ఇన్సూరెన్స్ చేపించాడు. కాగా 2021లో హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. దీంతో బాధితుడు ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించి ప్రమాద విషయాలను వివరించి ప్రమాద బీమాను క్లెయిమ్ చేయాల్సిందిగా కోరాడు. సదరు సంస్థ జాప్యం చేయడంతో బాధితుడు వినియోగాదారుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం చేయాల్సిందిగా కోరాడు. కమిషన్ ప్రెసిడెంట్, ఇద్దరు సభ్యులతో కూడిన బెంచ్ కేసును విచారించింది. ఇన్సూరెన్స్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలించి.. వాహనదారుడికి పూర్తి బీమాను చెల్లించాల్సిందేనని సదరు సంస్థను ఆదేశించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వినియోగదారుడికి రూ.5వేల నష్టపరిహారంతోపాటు రూ.2వేలు కోర్టు ఖర్చుల కింద అందజేయాలని, తమ ఆదేశాలను 45రోజుల్లో పాటించాలని పేర్కొన్నది.